క్లుప్తంగా

విద్యుత్ సరఫరాలో అంతరాయం

పాపన్నపేట(మెదక్): పాపన్నపేట మండలంలో ఆదివారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఏఈ సుధాకర్ తెలిపారు. మిన్‌పూర్ సబ్ స్టేషన్ 132 కేవీ సబ్‌స్టేషన్ పరిధిలో మరమ్మతుల కారణంగా ఉదయం 11 నుంచి సాయంత్రం 4 వరకు విద్యుత్ సరఫరా ఉండదని చెప్పారు.

టీకాలు తప్పనిసరి

చిలప్‌చెడ్(నర్సాపూర్): ముందస్తు జాగ్రత్తగా పశువులకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు వేయడం వల్ల అవి ఆరోగ్యంగా, బలంగా తయారవుతుందని వెటర్నరీ ఏడీ పవన్ అన్నారు. శనివారం మండల కేంద్రం చిలప్‌చెడ్‌లో ఆయన, సర్పంచ్ లక్ష్మీరెడ్డితో కలసి గాలికుంటు టీకాలు వేసే కార్యక్రమాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో వెటర్నరీ అసిస్టెంట్ సురేశ్, ఓఎస్‌లు శంకర్, అరవింద్, నాయకుడు దుర్గారెడ్డి పాల్గొన్నారు.

'తండాల అభివృద్ధిలో ప్రభుత్వం విఫలం'



చిన్నారి తల్లిదండ్రులను పరామర్శిస్తున్న గాలి అనిల్ కుమార్

వెల్దుర్తి(తూప్రాన్): గిరిజన తండాల అభివృద్ధి విషయంలో ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని టీపీసీసీ ఉపాధ్యక్షుడు, మెదక్ పార్లమెంట్ నియోజకవర్గ ఇన్‌చార్జ్ గాలి అనిల్‌కుమార్ విమర్శించారు. మండలంలోని మహ్మద్‌నగర్ పంచాయతీ పరిధి పెద్దమ్మగడ్డతండాలో ఇటీవల అనారోగ్యంతో మృతి చెందిన గిరిజన చిన్నారి అక్షర కుటుంబాన్ని ఆయన పరామర్శించి ఆర్థిక సాయం అందజేశారు. అదేవిధంగా అందుగులపల్లి గ్రామంలో నూతనంగా నిర్మిస్తున్న హనుమాన్ దేవాలయాన్ని సందర్శించి విరాళం అందజేశారు. కార్యక్రమంలో పీసీసీ నాయకుడు ఆంజనేయులుగౌడ్, మండలాధ్యక్షుడు మహేశ్‌రెడ్డి, శుహేందర్‌గౌడ్, సంజీవరెడ్డి పాల్గొన్నారు.

హాస్టళ్లలో సమస్యలు పరిష్కరించండి

రామాయంపేట(మెదక్): విద్యా సంస్థలు, హాస్టళ్లలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని ఎస్ఎఫ్ఐ జిల్లా సహాయ కార్యదర్శి ప్రవీణ్ డిమాండ్ చేశారు. శనివారం ఆయన మాట్లాడుతూ.. కస్తూర్బా, రెసిడెన్సియల్, గురుకుల పాఠశాలల్లో నెలకొన్న సమస్యలతో విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారని ఆరోపించారు. ఫీజు రియింబర్స్‌మెంట్ నిధులు విడుదల చేయకపోవడంతో నిరుపేద విద్యార్థులు చదువునకు దూరం అవుతున్నారన్నారు. ఖాళీగా ఉన్న పోస్టులను భర్తీ చేసి, గురుకులాలకు సొంత భవనాలు నిర్మించాలన్నారు.


బుంగను పూడ్చాలి



బుంగ వల్ల కోతకు గురైన కట్టను చూపుతున్న రైతులు

శివ్వంపేట(నర్సాపూర్): మండలంలోని రత్నపూర్ కొమటిచెరువుకు బుంగ పడి నీరు వృథాగా పోతుంది. కురిసిన వర్షాలకు గాను చెరువులోకి నీరు చేరి అలుగు పారింది. వారం రోజుల క్రితం బుంగ పడిన విషయం రైతులు సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. దీంతో పూడ్చినప్పటికీ పూర్తిస్థాయిలో అరికట్టకపోవడంతో నీరు వృథాగా పోతుందని రైతులు రాజు, శేఖర్, ప్రభాకర్ అన్నారు. బుంగ వల్ల చెరువు కట్ట కొంతభాగం కోతకు గురైందని వాపోయారు. సంబంధిత అధికారులు స్పందించి, బుంగను నివారించాలన్నారు. ఈ విషయం గురించి ఇరిగేషన్ ఈఈ సునీత దృష్టికి తీసుకెళ్లగా.. చెరువులో నీరు దగ్గగానే చర్యలు తీసుకుంటామన్నారు.

డబ్బులిస్తేనే రిజిస్ట్రేషన్



సమస్యను తహసీల్దార్‌కు వివరిస్తున్న రైతు విఠల్

టేక్మాల్(మెదక్): ప్రతీ డాక్యుమెంట్‌కు డబ్బులిస్తేనే ధరణి ఆపరేటర్ రిజిస్ట్రేషన్ చేస్తున్నాడని పలువురు రైతులు ఆరోపించారు. శనివారం టేక్మాల్ మండలంలోని పల్వంచ గ్రామానికి చెందిన విఠల్ అనే రైతు ఓ రిజిస్ట్రేషన్ పనిపై కార్యాలయానికి వచ్చాడు. పైసలు ఇస్తేనే పని మొదలు పెడతానని, లేదంటే కాసేపు ఆగలంటూ గంటల కొలది నిలబెడుతున్నారని ఆరోపించారు. ఒక్కో డాక్యుమెంట్‌కు రూ.1000 వసూలు చేస్తున్నాడని చెప్పారు. ఈ విషయమై రైతు తహసీల్దార్ మల్లయ్యకు వివరించగా.. చర్యలు తీసుకుంటాన ని చెప్పారు.

కలుషిత నీటిపై ఆందోళన

సీతారం తండా వాసుల నిరసన



కలుషిత నీటిని చూపిస్తూ నిరసన వ్యక్తం చేస్తున్న సీతారం తండావాసులు

శివ్వంపేట(నర్సాపూర్): తండాకు మంచినీరు అందించే బోరుబావి చెరువులో ఉండగా, వర్షాలతో చెరువులో అది మునిగిపోయింది. దీంతో చెరువులో మునిగిన బోరుబావి నుంచి వస్తున్న కలుషిత నీరే రక్షితవాటర్ ట్యాంకు ద్వారా తండాకు సరఫరా అవుతుంది. మిషన్ భగీరథ నీరు సైతం సీతారం తండాకు రాకపోవడంతో కలుషిత నీరు తాగాల్సిన పరిస్థితి నెలకొంది. దీంతో తాగునీటి సమస్య పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ తండావాసులు శనివారం నిరసన వ్యక్తం చేశారు. నెల రోజుల నుంచి ట్యాంకు బోరు చెరువులో మునిగిపోవడంతో అదే బోరు నుంచి పంచాయతీ సిబ్బంది నీరు సరఫరా చేస్తున్నారు. దీంతో కలుషిత నీరు వస్తుందని తండా వాసులు వాపోయారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. కలుషిత నీటి వల్ల అనారోగ్య సమస్యలు వస్తున్నాయన్నారు. తాగునీటి కోసం వ్యవసాయ పొలాల్లో ఉన్న బోరుబావుల నుంచి నీటిని తెచ్చుకుంటున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. వారం రోజుల క్రితం తండాకు వచ్చిన ఎమ్మెల్యే మదన్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లగా..తండాకు మిషన్ భగీరథ తాగునీరు వచ్చేలా చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. సంబంధిత అధికారులు స్పందించి తండాలో నీటి సమస్యను పరిష్కరించాలని కోరారు.

ఆర్టీసీ ఉద్యోగుల నిరసన



నర్సాపూర్: డిపో ఎదుట బైఠాయించి నిరసన వ్యక్తం చేస్తున్న ఉద్యోగులు, కార్మికులు

నర్సాపూర్: ఆర్టీసీ బిల్లుపై గవర్నర్ సంతకం చేయనందుకు తెలంగాణ మజ్దూర్ యూనియన్ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు రెండు గంటల పాటు డిపో ఎదుట బైఠాయించి నిరసన వ్యక్తం చేస్తున్నామని యూనియన్ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి శాఖయ్య తెలిపారు. శనివారం ఉదయం ఆరు గంటల నుంచి 8 గంటల వరకు బస్సులు నిలిపి వేసి స్థానిక ఆర్టీసీ డిపో ఎదుట ఆర్టీసీ ఉద్యోగులు, కార్మికులు నిరసన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో డిపో ఉద్యోగులు నరేందర్, శ్యాంసుందర్‌గౌడ్, వెంకట్‌గౌడ్, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

మెదక్: రాష్ట్ర ప్రభుత్వం ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేస్తూ, కార్మికులను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తింపునిస్తూ బిల్లు ప్రవేశపెట్టగా గవర్నర్ ఆమోదం తెలుపలేదని ఆగ్రహించిన ఆర్టీసీ కార్మికులు శనివారం బస్ డిపో ఎదుట రెండు గంటల పాటు ధర్నా చేశారు. ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఈ బిల్లును వెంటనే ఆమోదించాలని డిపో ఎదుట ఉదయం 6 నుంచి 8 వరకు నల్ల బ్యాడ్జీలు ధరించి ధర్నా చేశారు. కార్యక్రమంలో తెలంగాణ మజ్దూర్ యూనియన్ నాయకులు ఎంఆర్కే రావుతో పాటు శ్రీనివాస్‌రెడ్డి, మొగులయ్య పాల్గొన్నారు.

తౌర్యానాయక్ కుటుంబాన్ని ఆదుకుంటాం

సంతాప సభలో ఎంపీ కొత్త ప్రభాకర్‌రెడ్డి



మృతుని భార్యకు ఆర్థికసాయం అందిస్తున్న ఎంపీ కొత్త ప్రభాకర్‌రెడ్డి

రామాయంపేట(మెదక్): ఇటీవల మృతి చెందిన నార్సింగి మండలంలోని నర్సంపల్లి తండాకు చెందిన బీఆర్ఎస్ నాయకుడు తౌర్యానాయక్ కుటుంబాన్ని ఆదుకుంటామని మెదక్ ఎంపీ కొత్త ప్రభాకర్‌రెడ్డి అన్నారు. తండాలో శనివారం జరిగిన తౌర్యానాయక్ సంతాప సభలో ఆయన మాట్లాడుతూ.. పార్టీ అభివృద్ధికి ఎనలేని కృషి చేశారని, ఆయన మృతి పార్టీకి తీరని లోటన్నారు. తౌర్యానాయక్ కుటుంబానికి పార్టీ సభ్యత్వ బీమాకు సంబంధించి రూ. 2 లక్షలతో పాటు రైతుబీమా కింద రూ. 5 లక్షలు మంజూరు చేయిస్తానని ఎంపీ హామీ ఇచ్చారు. అలాగే తనవంతు సాయంగా రూ. 3 లక్షలు ఇస్తున్నానని, మృతుడి భార్య ఉద్యోగాన్ని పర్మినెంట్ చేయించడానికి కృషి చేస్తానన్నారు. అంతకుముందు ఎంపీ తౌర్యానాయక్ చిత్రపటానికి పూలమాలలువేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో నార్సింగి, చేగుంట ఎంపీపీలు సబిత, శ్రీనివాస్, రెండు మండలాల జెడ్పీటీసీలు కృష్ణారెడ్డి, శ్రీనివాస్, బీఆర్ఎస్ మండలాల అధ్యక్షులు బాబు, వెంగళరావు, రణం శ్రీనివాస్, రైతుబంధు అధ్యక్షులు లింగారెడ్డి, భాస్కరాచారి, వైస్ ఎంపీపీ సుజాత, సర్పంచ్‌లు నాయకులు పాల్గొన్నారు.

మనోహరాబాద్(తూప్రాన్): రెండు రోజుల క్రితం ఎంపీపీ పురం నవనీత అత్తమ్మ మృతి చెందింది. ఈ విషయం తెలుసుకున్న ఎంపీ కొత్త ప్రభాకర్‌రెడ్డి వారి కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఎంపీ వెంట మండల బీఆర్ఎస్ అధ్యక్షుడు మహేశ్, తూప్రాన్ పీఏసీఎస్ చైర్మన్ బాలకృష్ణారెడ్డి, సర్పంచ్‌లు నాగభూషణం, భగవాన్‌రెడ్డి ఉన్నారు.

అభివృద్ధి పనులు తప్పకుండా చేపట్టాలి

డీపీఓ సాయిబాబా

నర్సాపూర్: ప్రభుత్వం మన ఊరు – మన బడి కార్యక్రమం కింద పాఠశాలల అభివృద్ధికి మంజూరు చేసిన పనులను తప్పకుండా చేపట్టాలని డీపీఓ సాయిబాబా సర్పంచ్‌లకు సూచించారు. శనివారం మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో ఆయా మండలాల్లో ఈజీఎస్ కింద మంజూరైన పనులను చేపట్టని గ్రామ సర్పంచ్‌లు, గ్రామ కార్యదర్శులతో ఆయన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఈజీఎస్ కింద పాఠశాలలకు మంజూరైన పనులను సకాలంలో పూర్తి చేయాల్సి ఉందని, ఇంకా పనులు చేపట్టకపోవడం విచారకరమన్నారు. పనులు తప్పకుండా చేపట్టాలని, చేపట్టకపోతే ప్రభుత్వం ఒప్పుకోదని, అవసరమైతే కాంట్రాక్టర్లకు అప్పగించాలని చెప్పారు. చిలప్‌చెడ్ సర్పంచ్ లక్ష్మి మాట్లాడుతూ.. గతంలో చేపట్టిన అభివృద్ధి పనులకు బిల్లులు రాక ఇబ్బందులు పడ్డామని, మళ్లీ పనులు చేయాలంటే ఎలా అని ప్రశ్నించారు. సమావేశంలో చిలిపిచెడ్ ఎంపీడీఓ శశిప్రభ, ఎంఈఓ బుచ్యానాయక్, ఎంపీఓ శ్రీనివాస్, పలు మండలాల ఎంపీఓలు పాల్గొన్నారు. ఇదిలా ఉండగా ఈజీఎస్ నిధులతో పనులు చేపట్టడంలో వెనకపడిన గ్రామ పంచాయతీల సర్పంచ్‌లతో సమావేశం ఏర్పాటు చేసి ఏడు మండలాలకు చెందిన 32 మంది సర్పంచ్‌లను సమీక్షకు రావాలని అధికారులు సూచిస్తే పది మంది సర్పంచ్‌లే పాల్గొనడం గమనార్హం.

అంగన్‌వాడీ తనిఖీ



గ్రామస్తులతో మాట్లాడుతున్న అధికారులు

సాక్షి ఎఫెక్ట్

మనోహరాబాద్(తూప్రాన్): అంగన్‌వాడీలో కుళ్లిన గుడ్ల పంపిణీ అనే కథనం శనివారం సాక్షిలో ప్రచురితమైంది. దీంతో కలెక్టర్ ఆదేశాల మేరకు అధికారులు శనివారం మండలంలోని రంగాయపల్లిలో అంగన్‌వాడీ కేంద్రాన్ని తనిఖీ చేశారు. ఈ సందర్భంగా తహసీల్దార్ శ్రీనివాస్‌రావు మాట్లాడుతూ.. పత్రికల్లో వచ్చిన కథనాల ప్రకారం అంగన్‌వాడీ కేంద్రం నుంచి సరఫరా అయిన గుడ్లు కుళ్లినవని తెలిపారు. కాగా సంబంధిత కాంట్రాక్టర్‌తో మాట్లాడి మరోకసారి ఇలాంటివి రాకుండా చర్యలు చేపడతామని గ్రామస్తులకు హామీనిచ్చారు. వీరి వెంట ఆర్ఐ దీక్షిత్, ఐసీడీఎస్ సూపర్ వైజర్ సక్కుబాయి పాల్గొన్నారు.

చాకరిమెట్లలో భక్తుల పూజలు



ఆంజనేయస్వామికి పూజలు చేస్తున్న అర్చకులు

శివ్వంపేట(నర్సాపూర్): చాకరిమెట్ల సహకార ఆంజనేయస్వామి ఆలయంలో శనివారం భక్తజన సందడి నెలకొంది. ఉమ్మడి జిల్లా నుంచే కాకుండా వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తుల స్వామివారిని దర్శించుకున్నారు. ఆలయ అర్చకులు ప్రత్యేక పూజలు చేపట్టారు. కార్యక్రమంలో ఈఓ శ్రీనివాస్, ఆలయ ఫౌండర్, చైర్మన్ ఆంజనేయశర్మ, ప్రధాన అర్చకులు ఉన్నారు.

దిష్టిబొమ్మ దహనం

టేక్మాల్(మెదక్): మండల కేంద్రమైన చౌరస్తాలో గిరిజనులు శనివారం సోయం బాబురావు దిష్టిబొమ్మను దహనం చేశారు. కార్యక్రమంలో బంజారా సేవాలాల్ సంఘం జిల్లా అధ్యక్షుడు రమేశ్‌నాయక్, టీఆర్ఎస్ మండల గిరిజన మోర్చ అధ్యక్షుడు సర్దార్, కాంగ్రెస్ ఎస్సీ సెల్ నియోజకవర్గం అధ్యక్షులు సేవాలాల్, సక్రు, నాయకులు కిషన్, విఠల్, రాజు, వసంత్, రమేశ్ పాల్గొన్నారు.

పట్టుదలతో చదివి ప్రతిభ చూపాలి



విద్యార్థులకు బహుమతి అందిస్తున్న సొసైటీ కార్యదర్శి, ప్రతినిధులు

నర్సాపూర్: విద్యార్థులు పట్టుదలతో చదివి ప్రతిభ చూపాలని శ్రీవిష్ణు ఎడ్యుకేషనల్ సొసైటీ సెక్రటరీ ఆదిత్య విస్సం అన్నారు. సొసైటీ ఆధ్వర్యంలో నర్సాపూర్‌లో కొనసాగుతున్న బీవీ రాజుఇంజనీరింగ్ కాలేజీలో మూడు రోజులుగా ఐపెక్–2023 గోకార్ట్ పోటీలు శనివారం ముగిశాయి. ఇందులో ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. అనంతరం పోటీల్లో గెలుపొందిన విద్యార్థుల బృందాలకు ఆయన బహుమతులు, మెమోంటోలు అందజేశారు. పోటీల్లో శ్రీనిధి ఇంజనీరింగ్ కాలేజీ విద్యార్థులు ప్రథమ స్థానం, బీవీఆర్ఐటీ(హైదరాబాద్) మహిళల కాలేజీ విద్యార్థినీలు ద్వితీయస్థానం, జై శ్రీరాం ఇంజనీరింగ్ కాలేజీ విద్యార్థులు తృతీయ స్థానంలో నిలిచారు. ఈ కార్ట్ పోటీల్లో బీవీ రాజు ఇంజనీరింగ్ కాలేజీ విద్యార్థులు ప్రథమ స్థానంలో నిలిచారు. కార్యక్రమంలో కాలేజీ డైరెక్టర్ డాక్టర్ లక్ష్మీప్రసాద్, కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ సంజయ్‌దూబె, ప్రోగ్రాం కన్వీనర్, డీన్ డాక్టర్ మురళీకృష్ణ, కాలేజీ మేనేజర్ బాపిరాజు, హెచ్ఓడీలు పాల్గొన్నా రు. ఇదిలాఉండగా గోకార్ట్ పోటీల సందర్భంగా కాలేజీలో ఏర్పాటు చేసిన ట్రాక్‌పై శనివారం ఉదయం నుంచి పోటీలు నిర్వహించారు.

చలో తిరుపతిని విజయవంతం చేయాలి

నర్సాపూర్: ఈనెల 7న చేపట్టే చలో తిరుపతి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు, నర్సాపూర్ మున్సిపల్ చైర్మన్ మురళీయాదవ్ అన్నారు. శనివారం కార్యక్రమం వాల్ పోస్టర్‌ను మున్సిపల్ కార్యాలయంలో ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడారు. ఈనెల 7న తిరుపతిలో జరిగే అఖిల భారత జాతీయ ఓబీసీ 8వ మహాసభను విజయవంతం చేయాలని కోరారు. ఆయన వెంట శ్రీనివాస్‌గౌడ్, నాయకులు సుభాశ్‌గౌడ్, మల్లికార్జున్‌గౌడ్, ప్రశాంత్, వెంకటేష్, ఆంజనేయులు, నాగరాజు తదితరులు ఉన్నారు.

నిజాంపేట(మెదక్): ఈనెల 7న తిరుపతిలో జరుగనున్న జాతీయ ఓబీసీ ఎనిమిదవ మహాసభలను సంబంధించి వాల్‌పోస్టర్లను శనివారం ఆవిష్కరించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ పంజా విజయకుమార్, సంఘం ప్రతినిధులు శ్రీకాంత్, మల్లికార్జున్‌గౌడ్, ప్రశాంత్‌కుమార్, పాల్గొన్నారు.

డిజిటల్ పేమెంట్‌పై అవగాహన

పెద్దశంకరంపేట(మెదక్): మహిళా సమాఖ్య సభ్యులు డిజిటల్ పేమెంట్‌పై అవగాహన తప్పనిసరిగా పెంచుకోవాలని ఐకెపి డీపీఎం మోహన్ అన్నారు. శనివారం పేటలో మహిళా సమాఖ్య సభ్యులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. క్రమం తప్పకుండా రుణాలు చెల్లించాలన్నారు. ఏపీఎం గోపాల్, సీసీలు సునీత, వీఓఏ రమ, సభ్యులు ఫాజియా, సంగీతతో పాటు తదితరులు పాల్గొన్నారు.

తొలిమెట్టుతో బోధనలో మార్పు



వెల్దుర్తి(తూప్రాన్): తొలిమెట్టు శిక్షణను పరిశీలిస్తున్న డీఆర్పీ రామకృష్ణ

వెల్దుర్తి(తూప్రాన్): ఎఫ్ఎల్ఎన్ శిక్షణ కార్యక్రమంలో భాగంగా వెల్దుర్తి ఉన్నత పాఠశాలలో కొనసాగుతున్న తొలిమెట్టు శిక్షణ శిబిరాన్ని శనివారం డీఆర్పీ రామకృష్ణ సందర్శించారు. బోధనలో వినూత్న పద్ధతులు అవలంబించి విద్యార్థుల్లో అభ్యసన సామర్థ్యాలను పెంపొందించాలని ఉపాధ్యాయులకు సూచించారు. మండల నోడల్ అధికారి సాంబయ్య, డీఆర్పీ సంఘమేశ్వర్, మండల ఆర్పీలు , ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

హవేళీఘనపూర్: ఉపాధ్యాయులకు కొనసాగుతున్న గణిత బోధన శిక్షణ కేంద్రాన్ని ఎంఈఓ నీలకంఠం శనివారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఉపాధ్యాయులు తరగతి ప్రణాళిక ప్రకారం పాఠ్యపుస్తకాలను ఉపయోగించి బోధించాలన్నారు. కోర్సు డైరెక్టర్ మధుమోహన్, అసిస్టెంట్ కోర్సు డైరెక్టర్ విజయలక్ష్మి, రిసోర్స్‌పర్సన్ అంజయ్య, నరేందర్‌రెడ్డి, సీఆర్పీలు పాల్గొన్నారు.

సెంట్రింగ్ కార్మికుడిని కరెంట్ షాక్

కౌడిపల్లి(నర్సాపూర్): ఇంటి స్లాబ్‌పై సెంట్రింగ్ వర్క్ చేస్తుండగా ఐరన్ రాడ్ విద్యుత్ తీగలకు తగలడంతో కరెంట్‌షాక్ తగలడంతో ఒకరికి గాయాలయ్యాయి. ఈ సంఘటన మండల కేంద్రం కౌడిపల్లిలో శనివారం జరిగింది. తోటి కార్మికులు తెలిపిన వివరాల ప్రకారం.. కౌడిపల్లి ప్రధాన రహదారి పక్కన గ్రామానికి చెందిన డాక్టర్ సుధాకర్ ఇంటివద్ద రెండో అంతస్తు స్లాబ్ వేసేందుకు సెంట్రింగ్ కార్మికులు ఐరన్‌రాడ్స్ వేసే పనులు చేస్తున్నారు. కౌడిపల్లికి చెందిన కార్మికుడు బర్ల యాదగిరి ఐరన్‌రాడ్ అమర్చే క్రమంలో పక్కనున్న హైవోల్టేజీ విద్యుత్ తీగలకు తగిలింది. దీంతో కరెంట్ షాక్‌తో యాదగిరికి కాళ్లు, చేతులకు మంటలు వచ్చి గాయాలయ్యాయి. అనంతరం బాధితుడిని మెదక్ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు.

పేదలకు సీఎంఆర్ఎఫ్ సంజీవని



నర్సాపూర్‌లో చెక్కులు అందిస్తున్న సునీతారెడ్డి

నర్సాపూర్: సీఎం రిలీఫ్ ఫండ్ పథకం పేదలకు సంజీవని లాంటిదని రాష్ట్ర మహిళా కమిషన్ చైర్‌పర్సన్ సునీతారెడ్డి చెప్పారు. శనివారం ఆమె పలువురు లబ్ధిదారులకు సీఎంఆర్ఎఫ్ చెక్కులు పంపిణీ చేశారు. సీఎం కేసీఆర్ సీఎంఆర్ఎఫ్ ద్వారా ఆపదలో ఉన్న వారికి ఆర్థికసాయం అందజేస్తున్నారని ఆమె చెప్పారు. నర్సాపూర్, చిలప్‌చెడ్ తదితర మండలాలకు చెందిన పలువురు లబ్ధిదారులకు ఆమె చెక్కులు అందజేశారు. కార్యక్రమంలో పలువురు నాయకులు పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

◆ ఉచిత యునాని వైద్య శిబిరం

పాపన్నపేట(మెదక్): అత్యంత ప్రాచీనమైన యునాని వైద్య సేవలు ప్రతీ ఒక్కరు వినియోగించుకొని ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని పాపన్నపేట యునాని డాక్టర్ యాకూత్ ఖలీల్ సూచించారు. శనివారం మండల పరిధిలోని రామతీర్థంలో ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. సీజనల్ వ్యాధులపై అవగాహన పెంచుకోవాలన్నారు. మోకాళ్లు, కీళ్ల నొప్పులు, నరాల బలహీనత, జలుబు, జ్వరం తదితర వాటిపై అప్రమత్తంగా ఉండాలన్నారు. బాధితులకు పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ లక్ష్మి, పంచాయతీ సెక్రటరి అనూష, నాయకులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

◆ విద్యార్థులకు రాగిజావ

చిన్నశంకరంపేట(మెదక్): మండలంలోని రుద్రారం ప్రాథమిక పాఠశాలలో శనివారం విద్యార్థులకు రాగి జావ అందించారు. గ్రామ సర్పంచ్ లక్ష్మణ్ విద్యార్థులకు రాగి జావ పంపిణీ ప్రారంభించారు. కార్యక్రమంలో హెచ్ఎం ప్రవీణ్‌కుమార్, కార్యదర్శి అనురాధ పాల్గొన్నారు.

◆ 15న జోగిపేటలో సాయిచంద్ సంస్మరణ సభ

అల్లాదుర్గం(మెదక్): తెలంగాణ ఉద్యమకారుడు, మాజీ గిడ్డంగుల సంస్థ చైర్మన్ స్వర్గీయ సాయిచంద్ సంస్మరణ సభ ఈనెల 15న సంగారెడ్డి జిల్లా జోగిపేట పట్టణంలో నిర్వహిస్తున్నట్లు దళిత, బహుజన సంఘం అందోల్ నియోజకవర్గ నాయకుడు గార్లపల్లి మల్లేశం శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. దళిత, బహుజన నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో హాజరు కావాలని కోరారు.

టేక్మాల్(మెదక్): దివంగత రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్ సాయిచంద్ సంస్మరణ సభను విజయవంతం చేయాలని సంస్మరణ సభ కమిటీ అధ్యక్షుడు మొగులయ్య కోరారు.

◆ డ్రైవింగ్ లైసెన్స్‌ల అందజేత

చేగుంట(తూప్రాన్): దుబ్బాక ఎమ్మెల్యే రఘునందన్‌రావు చొరవతో యువతకు మంజూరీ చేయించిన డ్రైవింగ్ లైసెన్స్‌లను శనివారం బీజేపీ నాయకులు అందించారు. ఈ సందర్భంగా బీజేపీ మండలాధ్యక్షుడు భూపాల్ మాట్లాడుతూ.. చేగుంట మండల యువతకు ఎమ్మెల్యే సొంత డబ్బులతో డ్రైవింగ్ లైసెన్స్‌లను మంజూరీ చేయించినట్లు తెలిపారు. 87 మందికి మంజూరైన డ్రైవింగ్ లైసెన్స్‌లను శనివారం అందజేశారు. నాయకులు సంతోష్‌రెడ్డి, గణేశ్‌రవికుమార్, తదితరులు పాల్గొన్నారు.

◆ ఆర్థిక సాయం

చేగుంట(తూప్రాన్): ప్రజాహిత ఫౌండేషన్ వ్యవస్థాపకులు మామిడి మోహన్‌రెడ్డి మండలంలో ఇటీవల మృతి చెందిన కుటుంబాలను పరామర్శించి ఆర్థిక సాయం అందించారు. పొలంపల్లిలో రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన యాదమ్మ, బాలవీరయ్య కుటుంబీకులను పరామర్శించి మృతుల కుమార్తె భాగ్యకు రూ. 5 వేలు, రెడ్డిపల్లి గ్రామంలో రవీందర్ కుటుంబీకులను పరామర్శించి ఆర్థిక సాయం అందించారు. కార్యక్రమాల్లో చింటూ సుదర్శన్, కృష్ణ, ఎల్లం, సందీప్, ముత్యం, రాములు తదితరులు పాల్గొన్నారు.

◆ నిత్యావసర సరుకుల పంపిణీ

వెల్దుర్తి(తూప్రాన్): ఇటీవల కురిసిన భారీ వర్షాలకు సర్వం కోల్పోయి ఏటూరు నాగారం శిబిరంలో తలదాచుకుంటున్న ములుగు జిల్లాలోని మోరంచపల్లి, కొండాయ్, మల్యాల గ్రామాలకు చెందిన బాధితులకు బీఆర్ఎస్ రాష్ట్ర సోషల్ మీడియా అండగా నిలిచిందని రాష్ట్ర సభ్యుడు శ్రీనివాస్‌రెడ్డి పేర్కొన్నారు. ఐటీడీఏ ఏర్పాటు చేసిన శిబిరంలో సుమారు 250 కుటుంబాలకు నిత్యావసర సరుకులు, దుస్తులు పంపిణీ చేశామన్నారు. కార్యక్రమంలో వరంగల్ రవికుమార్, దేవేందర్, ప్రీతిరెడ్డి, మహ్మద్‌పాషా తదితరులు పాల్గొన్నారు.

◆ ఆడబిడ్డలకు షాదీముబారక్ వరం

వెల్దుర్తి(తూప్రాన్): తెలంగాణ ఆడబిడ్డలకు షాదీ ముబారక్ వరమని ఎంపీపీ స్వరూప అన్నారు. మండలంలోని మానెపల్లి గ్రామానికి చెందిన ఫకీర్ సాజిదాబేగంకు మంజూరైన షాదీ ముబారక్ చెక్కును శనివారం ఆమె అందజేశారు. కార్యక్రమంలో సర్పంచ్ వెంకటలక్ష్మీశ్రీనివాస్‌రెడ్డి, శ్రీనివాస్, లక్ష్మణ్, దినేష్ తదితరులు పాల్గొన్నారు.

◆ అభివృద్ధి పనుల పరిశీలన



కొల్చారం(నర్సాపూర్): మండలంలోని వెంకటాపూర్, పోతిరెడ్డిపల్లి గ్రామాల్లో చేపడుతున్న అభివృద్ధి పనులను శనివారం ఎంపీడీఓ గణేశ్‌రెడ్డి పరిశీలించారు. వెంకటాపూర్‌లో చేపట్టిన సంపద వనాలు, పోతిరెడ్డిపల్లి ప్రకృతి వనం, అక్కడ చేపడుతున్నటు వంటి నర్సరీ నిర్వహణ తీరుపై ఆరా తీశారు. వర్షాకాలం నేపథ్యంలో మొక్కల పెంపకానికి అనువైన సమయం కావడం, మధిర ప్రత్యేక రకాలైన మొక్కలను పెంచేందుకు చర్యలు తీసుకోవాలని అక్కడి గ్రామపంచాయతీ, ఉపాధి హామీ, సిబ్బందికి సూచించారు. ఆయన వెంట సర్పంచ్ కిష్టయ్య, ఏపీఓ మహిపాల్ రెడ్డి, పంచాయతీ కార్యదర్శి మౌనిక ఉన్నారు.

హవేళీఘనపూర్: మండలంలోని బాలానగర్ గ్రామంలో కొనసాగుతున్న పంచాయతీ భవన నిర్మాణ పనులను మెదక్ ఎంపీడీఓ ప్రశాంత్ శనివారం పరిశీలించారు. ఎంపీడీఓవెంట గ్రామ సర్పంచ్ వికాస్ తదితరులు ఉన్నారు.

◆ నీటి ఎద్దడి నివారణకు చర్యలు

శివ్వంపేట(నర్సాపూర్): గ్రామాల్లో తాగునీటి ఎద్దడి రాకుండా చర్యలు తీసుకుంటున్నట్లు మిషన్ భగీరథ ఈఈ కమలాకర్ అన్నారు. మండలంలోని పలు తండాల్లో తలెత్తిన నీటి సరఫరా సమస్యను పరిష్కరిస్తున్నట్లు చెప్పారు. పలు చోట్ల పైప్‌లైన్ దెబ్బతినడం వల్ల అంతరాయం ఏర్పడిందని, అందుకు సంబంధించి మరమ్మతుల పనులను పరిశీలించారు. కార్యక్రమంలో డీఈ ప్రవీణ్, సర్పంచ్ సోని తదితరులు ఉన్నారు.

◆ చౌదర్‌పల్లిలో కార్డన్ సెర్చ్

రేగోడ్(మెదక్): మండలంలోని చౌదర్‌పల్లి గ్రామంలో శనివారం అల్లాదుర్గం సీఐ జార్జి ఆధ్వర్యంలో కార్డన్ సెర్చ్ నిర్వహించారు. సైబర్ నేరాలపై జాగ్రత్తగా ఉండాలని చెప్పారు. పెద్దశంకరంపేట, అల్లాదుర్గం, టేక్మాల్ ఎస్ఐలు బాల్‌రాజ్, ప్రవీణ్‌రెడ్డి, రమేశ్, ఏఎస్ఐ మల్లయ్య, సిబ్బంది పాల్గొన్నారు.

◆ వైద్య పరీక్షలు

శివ్వంపేట(నర్సాపూర్): మండల కేంద్రం శివ్వంపేట పంచాయతీ కార్యాలయం వద్ద శనివారం వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. లేబర్ కార్డు కల్గి ఉన్న వారికి వైద్య సిబ్బంది పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు అందజేశారు. కార్యక్రమంలో సర్పంచ్ శ్రీనివాస్‌గౌడ్, వైద్య సిబ్బంది, పంచాయతీ పాలకవర్గం సభ్యులు ఉన్నారు.

◆ భిక్షాటన చేసిన పంచాయతీ కార్మికులు



మనోహరాబాద్(తూప్రాన్): పంచాయతీ కార్మికులు తమ సమస్యలు పరిష్కరించాలని చేపట్టిన సమ్మెలో భాగంగా శనివారం దేవాలయం వద్ద భిక్షాటన చేశారు. ఈ సందర్భంగా జిల్లా పంచాయతీ కార్మికుల కార్యదర్శి ఆసిఫ్ ఆధ్వర్యంలో పంచాయతీ కార్మికులు సీతారామాలయం వద్ద భిక్షాటన చేశారు.

శివ్వంపేట(నర్సాపూర్): పంచాయతీ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ శనివారం 32వ రోజు ఎంపీడీఓ కార్యాలయం వద్ద సమ్మె చేపట్టారు. తమ సమస్యలు ప్రభుత్వం పరిష్కరించడంలో నిర్లక్ష్యం వహిస్తుందని కార్మికుల సంఘం మండల అధ్యక్షుడు శంకర్ అన్నారు. శనివారం సమ్మెలో ఆకులు తింటూ నిరసన వ్యక్తం చేశారు.